క్లుప్తంగా

అలమేలు మంగమ్మకు విశేష అభిషేకం



అలమేలు మంగమ్మకు అభిషేకం చేస్తున్న అర్చకులు

సింహాచలం : చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సుజాతనగర్‌లోని అలమేలు మంగమ్మ ఆలయంలో అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకాలు నిర్వహించి నక్షత్ర హారతులు అందజేశారు. లక్ష్మీ సహస్రం, విష్ణు సహస్రనామ పారాయణాన్ని విశేషంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి చందనంతో అలంకారం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కను బంధించి పట్టుకెళ్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని పల్లి వీధి, గొల్ల వీధి, మార్కెట్ లైన్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించారు. శునకాల స్వైరవిహారం రోజు రోజుకూ అధికమవుతుండటంతో ఆయా ప్రాంతాలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వారు కార్పొరేటర్ కొణతాల సుధ దృష్టికి తీసుకువెళ్లటంతో స్పందించిన ఆమె వీధి కుక్కల నివారణ చర్యలను చేపట్టారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం సిబ్బంది ఆయా ప్రాంతాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను బంధించి పట్టుకెళ్లారు.

కుంచుమాంబకు ప్రత్యేక పూజలు



పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పెదగంట్యాడలో వేంచేసియున్న కుంచుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మవారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, రాధ దంపతులు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి దంపతులు, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి దర్శించుకున్నారు.

'విశాఖ ఉక్కును అమ్మాలనుకోవడం దారుణం'



శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: దేశంలోనే ఎంతో పేరుపొందిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేయాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 783వ రోజు బుధవారం సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఉక్కు ఉద్యమాన్ని నిరాటంకంగా కొనసాగించడం కార్మికుల పోరాట పటిమకు నిదర్శనమన్నారు. కార్మికులు, నిర్వాసితుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. ప్రధాన పార్టీల నాయకులతో త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉక్కు పోరాటంలో పాల్గొని, పరిశ్రమను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జనరంజక పాలకుడు జగన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పాల్గొన్న సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు

- ఏ ముఖ్యమంత్రి అందించని సంక్షేమ పథకాలతో మేలు చేశారు
- పోస్టర్ ఆవిష్కరణలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా 85 శాతం ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పోస్టర్లను పెందుర్తి తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు 600కు పైగా హామీలతో మేనిఫెస్టో తయారు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. ఎస్సీలుగా ఎవరు పుట్టాలనుకుంటారని వారిని అవహేళన చేశారన్నారు. వాళ్ల సమస్యలు చెప్పుకుందామని నాయీ బ్రాహ్మణులు వెళితే వారి తోకలు కత్తిరిస్తానని చెప్పిన ఘనత చంద్రబాబుది అన్నారు. విశాఖలోని మత్స్యకారులు తమకు సౌకర్యాలు కల్పించాలని ధర్నా చేస్తే తాట తీస్తానని బీసీలను తక్కువ చేసి చూశారన్నారు. ఒక్క చంద్రబాబే కాకుండా ఆ ప్రభుత్వంలో పని చేసిన శాసనసభ్యులు కూడా మహిళలు, అధికారులను చిన్నచూపు చూశారన్నారు. మహిళా ఎమ్మార్వోని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళితే తప్పు చేసిన వ్యక్తిపై యాక్షన్ తీసుకోవడం మానేసి రాజీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారన్నారు. ఇంత చేస్తున్నా ఏదో రకంగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే కార్యక్రమాలు ప్రతిపక్షాలు చేస్తున్నాయన్నారు. వాటిని తిప్పికొట్టడానికి జగనన్నే మాభవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఈనెల 7వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి క్లస్టర్, ప్రతి సచివాలయం పరిధిలో మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి గడపకూ వెళ్లి అప్పటికి.. ఇప్పటికీ ఉన్న తేడా వివరించాలన్నారు. ప్రజలకు మరింతగా చేరువయ్యేందుకు వారి అభిప్రాయాలు తీసుకొని, వారికి భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అజయ్‌రాజ్, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 94,97 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, నాయకులు గొర్లె రామునాయుడు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని ద్రోణంరాజు నగర్‌లో ఎమ్మెల్యే బుధవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రామునాయుడు, లెక్కల రమేష్, లెక్కల వేణు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు మహేష్, ఆదిరెడ్డి మురళి, టీపీవో ప్రమీల, వర్క్స్ ఏఈ రాజశేఖర్, ఎలక్ట్రికల్ ఏఈ రవి పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి



సూర్యప్రభ వావానంపై అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదవరోజు బుధవారం స్వామివారికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవిలను విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధిల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు గిరి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి మృగయోత్సవం (దొంగలదోపు) నిర్వహించనున్నారు.


ఇంజినీరింగ్ షాప్స్ విభాగాధిపతికి అభినందనలు



దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగం అభివృద్ధికి సహకరించాలని విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ కోరారు. నూతన విభాగాధిపతిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఆయనను కలిసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ విడి భాగాల తయారీ, భారీ యంత్రాల రిపేర్ పనుల్లో ఇంజినీరింగ్ షాప్స్ ముఖ్య భూమిక వహిస్తోందన్నారు. ఈ ఏడాది కూడా వార్షిక లక్ష్యాల సాధనకు కార్మిక సంఘాలు, ఉద్యోగులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు విభాగం కార్మిక సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప, బొడ్డ గోవింద, కర్రి దాలినాయుడు, బి. ఆదినారాయణ, వీరాస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జయంత్యుత్సవాలు



విశేష అలంకరణలో అయ్యప్ప స్వామి



అయ్యప్పను దర్శించుకుంటున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: అయ్యప్ప స్వామి జయంత్యుత్సవాన్ని నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో జరిపించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆలయంలో అన్న సమారాధన చేశారు సేవా సంఘం ప్రతినిధులు ఎస్.ఆర్.వైద్యనాథన్, డాక్టర్ చరపాక నాగార్జున రాజు, డాక్టర్ శీలంశెట్టి విశ్వేశ్వరరావు, నంబారు రాజు తదితరులు పాల్గొన్నారు. స్వామి అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, కార్యదర్శి శేషగిరిరావు, అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు అదపాక వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. విశ్వజ్యోతి భజన మండలి బీహెచ్‌పీవీ టౌన్‌షిప్ వారి భజన కార్యక్రమం, కోలాటం ఆకట్టుకున్నాయి. స్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

2 వేల మందికి వైద్యసేవలు

ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో సుమారు 2 వేల మందికి వైద్యపరీక్షలు చేశారు. బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలతో పాటు ఆర్‌కే డెంటల్ కేర్ ఆధ్వర్యంలో దంతపరీక్షలు, డాక్టర్ పావనీస్ బెస్ట్ విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి, మందులు అందించారు. డాక్టర్ మీనాక్షి, డాక్టర్ బ్రహ్మేంద్ర నాయక్, డాక్టర్ స్మిత తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అష్ట ద్రవ్య గణపతి హోమం

ఉక్కునగరం: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ఉత్తర నక్షత్రం సందర్భంగా ఉదయం 6 గంటలకు అష్ట ద్రవ్య గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. 7 గంటలకు నవఫలాభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. తిరు ఉత్సవం, ఆరాట్టు పూజ, హారతి అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాకతీయ జంక్షన్‌లో..

గాజువాక: బీసీ రోడ్ కాకతీయ జంక్షన్‌లో హరిహర పుత్ర శబరి పీఠం సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వైఎస్సార్‌సీపీ 65వ వార్డు నాయకుడు మద్దాల అప్పారావు అయ్యప్పను దర్శించుకున్నారు.

ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించండి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అస్థిరపరిచేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ కోరారు. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన మజ్దూర్ కిసాన్ సంఘ్ మార్చ్‌కు సంఘీభావంగా స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు టీటీఐ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ముడి సరుకులను అందించకుండా ఉద్దేశపూర్వకంగా విశాఖ ఉక్కును నష్టాల్లో నెడుతున్నారన్నారు. ప్రభుత్వం సహకరిస్తే పూర్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడిపి ఏడాదికి రూ. 50 వేల కోట్లు టర్నోవర్ సాధించి, రూ. 9 వేల కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. యూనియన్ అధ్యక్షుడు వై.టి.దాస్ మాట్లాడుతూ కార్మికుల మనోధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నిర్వీర్యం చేసి ఉత్పత్తి , ఉత్పాదకత లక్ష్యాలను చేరకుండా నూతన వేతనాలు అమలు చేయకుండా మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. నాయకులు కె.ఎం. శ్రీనివాస్, ఎన్. రామారావు ప్రసంగించిన కార్యక్రమంలో డి. కృష్ణమూర్తి, యు. వెంకటేశ్వర్లు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే అసలైన సంపద



వైద్య పరీక్షలు చేస్తున్న హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యాన్ని మించిన సంపద ఉండదని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి అన్నారు. ఆరోగ్యం బాగుంటే ఆనందానికి అవధులు ఉండవన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, బిర్లా సన్ లైఫ్ హెల్త్ ఇన్స్యూ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఉదయం లేచినప్పటి నుంచి పడుకునే వరకు ఆహార నియమాలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. కార్యక్రమంలో శరీర అమరిక, బరువు, కొవ్వుశాతం, బయోలాజికల్ ఏజ్‌కు సరిపడా ఉండాల్సిన లక్షణాలు, ఇతర లోపాలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, వివిధ విభాగాల డీన్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల్లో పండగ సందడి



అమ్మవారికి ఉపారం పెడుతున్న భక్తులు

పెదగంట్యాడ: ఈ నెల 10న వైభవంగా నిర్వహించనున్న పెంటమాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో నెల్లిముక్కు గ్రామ పంచాయతీలోని 14 నిర్వాసిత గ్రామాల్లో పండగ సందడి కనిపిస్తోంది. పెంటమాంబ ఆలయ సముదాయంలోని కుంచుమాంబ, దుర్గాలమ్మ, మహాశక్తి, పోలమ్మ, భూలోకమ్మ అమ్మవార్లకు రోజూ విశేష పూజలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఘటాలను ఊరేగిస్తున్నారు. పండగను పురస్కరించుకుని రోజూ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో భక్తుల సందడి మరింత ఎక్కువైంది. ఆలయ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు పర్యవేక్షిస్తున్నారు.

నేడు సామాజిక తనిఖీల ప్రజావేదిక

సబ్బవరం: సామాజిక తనిఖీల 15వ విడత మండల స్థాయి ప్రజావేదిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

ఆలివ్‌రిడ్లే సంతతిని కాపాడుకోవాలి



సముద్రంలోకి వెళుతున్న తాబేలు పిల్లలు



ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న జేసీ కల్పనా కుమారి

పరవాడ: ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంతతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆర్థిక సహకారంతో ముత్యాలమ్మపాలెం తీరం హేచరీలో సంరక్షించిన 500 ఆలివ్‌రిడ్లే తాబేళ్లను జేసీ బుధవారం సముద్ర జలాల్లోకి వదిలారు. ఈ తాబేలు పిల్లల పెంపకానికి నిధులు కేటాయిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని జేసీ అభినందించారు. తీరంలో తాబేళ్లు పెట్టిన గుడ్లను సేకరించి అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హేచరీలో పిల్లలను పొదిగించి అనంతరం సముద్ర జలాల్లో విడిచిపెట్టడానికి అవసరమైన వ్యయాన్ని ఎన్టీపీసీ భరిస్తుందని ఫారెస్టు సెక్షన్ అధికారి ఎ.వి.ఎస్.కె.వర్మ చెప్పారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది ఈ.శివ తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని రాధాకుమారి

సబ్బవరం: మహోన్నత వ్యక్తి, దార్శనికుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పి. రాధాకుమారి అన్నారు. పాఠశాలలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీఎస్ గోవింద్, కుమార్‌ప్రకాష్, సనీత, రెజీనా, జయలక్ష్మి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరపినివానిపాలెంలో..

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని పెందుర్తి నియోజకవర్గం మాదిగ పోరాట సమితి ప్రతినిధి గొటివాడ సామ్రాట్ కుమార్ తెలిపారు. మండలంలోని పెదగొల్లపాలెం శివారు అమరపినివానిపాలెం గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్మ, మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు, నాయకులు దాసరి మధు, వార్డు మెంబర్ నోమేష్, దువ్వి దుర్గాలు, పెట్ల రాంబాబు, గొటివాడ సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ అమ్మవారి పండగ నేడు



వెన్నెలపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారు



బొద్దపువానిపాలెంలో వెలసిన దుర్గమాంబ అమ్మవారు

పరవాడ: మండలంలో ఈ-బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో వెలసిన శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా నిర్వహించనున్నామని సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు చెప్పారు. వేకువ జాము నుంచి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలు అందజేస్తామన్నారు. బాజా భజంత్రీలు, డప్పులు, మేళతాళాలతో అమ్మవారిని రాత్రికి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తామని చెప్పారు. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం భారీ బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి అనుపు కార్యక్రమాన్ని వైభవంగా జరపడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

వెన్నెలపాలెంలో..

వెన్నెలపాలెంలో కొలువుదీరిన శ్రీ దుర్గమాంబ గ్రామ దేవత పండగ ఈ నెల 6న (గురువారం) వైభవంగా నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని సర్పంచ్ వెన్నెల అప్పారావు తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలు, పూలతో అలంకరించారు. ఆ రోజు వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో షామియనాలు, బారికేడ్లు, తాగునీరు, ఉచిత ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనార్థం గురువారం రాత్రికి అమ్మవారిని పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, చిడతలు, భజనలు, డ్యాన్సులతో ఊరేగిస్తారు. రాత్రికి డ్యాన్స్ ధమాకా, రేలారే రేలా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం భారీ బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి అనుపు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టామని సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ వెన్నెల అరుణకుమారి తెలిపారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

మంత్రిపాలెం: బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని స్పృహ సోషల్ రీసెర్చ్ ఫౌండేషన్, సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య సంయుక్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బుధవారం బహుమతులు ప్రధానం చేసింది. ముఖ్య అతిథి ప్రొఫెసర్ టి.వి.కృష్ణమూర్తి సాంఘిక, సంక్షేమ హాస్టల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో జీవితాన్ని నిర్మించుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఆర్.ప్రసాద్, ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.అబ్రహం పాల్గొన్నారు.